క్లుప్తంగా

పంచాయతీ కార్యదర్శికి వీడ్కోలు



పంచాయతీ సెక్రటరీని సన్మానిస్తున్న సర్పంచ్, ఎంపీపీ, సచివాలయ సిబ్బంది

తర్లుపాడు: తర్లుపాడు పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న అచ్యుతరావుకు సర్పంచ్ పి.వరాలు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ముఖ్య అతిథిగా ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి పాల్గొని ఆయన సేవలను కొనియాడారు. సచివాలయం సిబ్బంది, ఎంపీటీసీ అంకమ్మ, కోఆప్షన్ సభ్యులు అక్బర్ అలీ, వైస్ సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, నాయకులు బ్రహ్మయ్య, ప్రభాకర్, ఎబినేజర్ తదితరులు ఘనంగా సన్మానించారు.

ఉత్తమ ఉపాధ్యాయినికి సన్మానం



ఉపాధ్యాయిని యాస్మిన్‌ను సన్మానిస్తున్న ఎంఈఓలు

కంభం: ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా అవార్డు అందుకున్న రావిపాడు(సీఆర్) ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయురాలు సయ్యద్ యాస్మిన్‌ను మంగళవారం ఎంఈఓలు మాల్యాద్రి, శార్వాణి, కాంప్లెక్స్ చైర్మన్ బీవీ రామకృష్ణ, కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఆమె సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో పీఏసీ చైర్మన్ నాగేశ్వరరెడ్డి, హెచ్ఎం విజయ నిర్మల, మోయినుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్‌కు తాడివారిపల్లి విద్యార్థులు



టేబుల్ టెన్నిస్‌కు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

తర్లుపాడు: రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలకు తాడివారిపల్లి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం అజీమ్‌బాషా మంగళవారం తెలిపారు. ఇటీవల ఒంగోలులోని హైదరీ క్లబ్‌లో నిర్వహించిన పోటీల్లో విద్యార్థులు సత్తా చాటారని వివరించారు. క్రీడాకారులు విష్ణు, వెంగళరెడ్డి, శివశంకర్, కార్తీక్, హైమావతి, భవానీ, భానుశ్రీ, స్నేహలత, ప్రణతి, లక్ష్మీ, అజయ్, కల్యాణ్‌రామ్, బాబు, మహేష్‌చంద్ర, శివకాశీరామ్ పోటీలకు ఎంపికైనట్లు వెల్లడించారు. విద్యార్థులతోపాటు పీడీ రాజశేఖర్‌ను హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ జట్టుకు మార్కాపురం విద్యార్థి



ఎం.అభి

మార్కాపురం: మార్కాపురం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి ఎం.అభి రాష్ట్ర స్థాయి అండర్–17 ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికైనట్లు హెచ్ఎం ఎం.చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. గతనెల 23న ఒంగోలులో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటి రాష్ట్ర జట్టుకు ఎంపిక కావడంపై పీడీ ఎం.జాహ్నవి ప్రియ, చెన్నకృష్ణయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

గ్రామ సభల్లో పనులు ఎంపిక చేయాలి

బేస్తవారిపేట: జాతీయ ఉపాధి హామీ పథకంలో పనుల ఎంపికకు గ్రామ సభలు నిర్వహించాలని ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో టీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్ఆర్ఈజీఎస్‌లో పని కోరిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని సూచించారు. గ్రామస్తుందరికీ ఉపయోగకరమైన పనులను ఎంపిక చేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ గురువరకుమార్, ఈసీ బాలకృష్ణ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల వేతన బకాయిలు చెల్లించండి

- రెండో రోజూ దీక్షలో స్వచ్ఛభారత్ కార్మికులు

కొమరోలు: వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట స్వచ్ఛభారత్ కార్మికులు చేపట్టిన నిరసన దీక్ష రెండో రోజు మంగళవారం కొనసాగింది. సీఐటీయూ నాయకుడు ఆవులయ్య మాట్లాడుతూ.. రెండు సంవత్సరాలుగా స్వచ్ఛభారత్ కార్మికులకు వేతనాలు చెల్లించడం లేదని పేర్కొన్నారు. కుటుంబాలను పోషించుకోవడం కోసం చిరుద్యోగులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వేతనం చెల్లించాలని సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేసినా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుండటాన్ని తప్పుబట్టారు. అధికారులు స్పందించకుంటే గురువారం నుంచి గ్రామ పంచాయతీల్లోనూ రిలే నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు.



నిరసన తెలుపుతున్న స్వచ్ఛభారత్ కార్మికులు



కంభంలో నిరసనకారులతో మాట్లాడుతున్న ఎక్సైజ్ సిబ్బంది



కంభం బస్టాండ్ వద్ద మద్యం కోసం బారులుదీరిన మందుబాబులు

చిరుద్యోగుల పొట్ట కొట్టొద్దు

- మద్యం షాపుల సిబ్బంది ఆందోళన

కంభం: ప్రభుత్వ మద్యం దుకాణాలు తొలగించి ప్రైవేట్ మద్యం షాపులు ఏర్పాటు చేస్తే తామంతా రోడ్డున పడాల్సి వస్తుందని సూపర్ వైజర్లు, సేల్స్‌మన్లు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం కంభంలో ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 2900 ప్రభుత్వ మద్యం దుకాణాల్లో 15 వేల మంది వరకు పనిచేస్తున్నారని ప్రస్తుతం వారందరి పరిస్థితి అగమ్యగోచరంగా మారిపోయిందన్నారు. ఇతర ఉద్యోగాలకు వెళ్లాలంటే గతంలో ఎక్కడ పనిచేశారో అడుగుతున్నారని, మద్యం దుకాణంలో చేశామంటే వెనక్కి పంపిస్తున్నారని వాపోయారు. తామంతా రిక్రూట్‌మెంట్ ద్వారా ఉద్యోగాలు పొందామని డిగ్రీ, ఇంటర్ చదువుకున్న వారు కూడా ఉన్నారని ఒక్కసారిగా ప్రైవేటీకరణ పేరుతో తమను తొలగిస్తే ఎలా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమకు ఏదో ఒక కార్పొరేషన్ ద్వారా ఉద్యోగవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కాగా మద్యం విక్రయాలు ఆపేయడంతో మందుబాబులు బారులు తీరారు. అయితే సిట్టింగ్ రూములు, కూల్‌డ్రింక్ షాపుల్లో అక్రమ మద్యం విక్రయాలు యథేచ్ఛగా సాగాయి.

న్యాయవాదుల చట్ట సవరణ సరికాదు

- విధులు బహిష్కరించి న్యాయవాదుల నిరసన

పొదిలి: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులోని న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించి కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల తలపెట్టిన న్యాయవాదుల చట్ట సవరణ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంవీ రమణకిషోర్ పేర్కొన్నారు. వెంటనే చట్ట సవరణలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి షేక్ షబ్బీర్, ఉపాధ్యక్షురాలు సుజాత, సంయుక్త కార్యదర్శి గాలిముట్టి పెద్దయ్య, న్యాయవాదులు రామమోహనరావు, బి.వెంకటేశ్వర్లు, గంగవరపు శ్రీనివాసులు, యశ్వంత్, జిలానీ, చినబాబు తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

సృజనాత్మకతను వెలికితీసేందుకే ‘చెకుముకి’



కొమరోలులో విజేతలకు బహుమతులిస్తున్న ఎంఈఓ వెంకటరత్నం



అర్ధవీడులో బహుమతులిస్తున్న ఎంఈఓ, జేవీవీ నాయకులు



గిద్దలూరులో ప్రశ్న పత్రాలు విడుదల చేస్తున్న నాయకులు



తర్లుపాడు : విజేతలతో జేవీవీ సభ్యులు, ఉపాధ్యాయులు



బహుమతులు పంపిణీ చేస్తున్న ఎంఈఓ రమణారెడ్డి

బేస్తవారిపేట: పోటీలు విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు దోహదపడతాయని ఎంఈఓ సీహెచ్ రమణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్‌లో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందించేందుకు, విజ్ఞానం వైపు నడిపించేందుకు చెకుముకి టాలెంట్ టెస్ట్‌లు ఉపయోగపడతాయని వివరించారు. మండల స్థాయిలో గెలుపొందిన పూసలపాడు జెడ్పీ హైస్కూల్, జెడ్పీ బాలికల హైస్కూల్, గలిజేరుగుళ్ల జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు ఆర్.రంగరాజు, హెచ్ఎం ఎంఎస్ శర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తర్లుపాడు: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టు నిర్వహించారు. క్విజ్ పోటీల్లో చెన్నారెడ్డిపల్లి జెడ్పీ పాఠశాల, తాడివారిపల్లి, తర్లుపాడు హైస్కూళ్ల విద్యార్థులు వరుస మూడు స్థానాల్లో నిలిచినట్లు జేవీవీ మండల కార్యదర్శి పి.కోటిమోహన్ తెలిపారు. విజేతలకు తర్లుపాడు లైబ్రేరియన్ సుబ్బారెడ్డి బహుమతులు అందించారు. హెచ్ఎం సుధాకర్, ఉపాధ్యాయులు గాలెయ్య, రాజ్‌కుమార్, సంజీవ్‌కుమార్, గోను శ్రీను, వెంకట రామిరెడ్డి, ఆనంద్, నాగేంద్ర, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. మండల స్థాయి విజేతలు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని జేవీవీ జిల్లా కార్యదర్శి మహమ్మద్ రఫీ, రాష్ట్ర కమిటీ సభ్యులు సుబ్రమణ్యం, మండల అధ్యక్షుడు రాజగోపాల్ తెలిపారు. విద్యార్థులకు సాధన కళాశాల యాజమాన్యం బహుమతులిచ్చింది.

కంభం: స్థానిక బోర్డు స్కూల్లో మండల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారులు మాల్యాద్రి, శార్వాణి ప్రశ్న పత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజాభివృద్ధిలో శాస్త్రసాంకేతిక రంగాల పాత్ర ఎంతో ఉందన్నారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే సైన్స్‌పై మక్కువ పెంచుకోవాలన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జేవీవీ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, నాయబ్ రసూల్, మస్తాన్, వరికుంట్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: సత్యానికి ప్రతిరూపం సైన్స్ అని జన విజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు వైఎస్సార్ సీపీ నాయకుడు డా.బాలనరసింహారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం నిర్వహించిన చెకుముకి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మూఢ నమ్మకాలను పారద్రోలి నూతన సమాజానికి విద్యార్థులు నాంది పలకాలని సూచించారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు పి.స్వరూపారెడ్డి, డాక్టర్ జె.వి.నారాయణ, బ్రహ్మానందరెడ్డి, రాజు, డి.వెంకటేశ్వర్లు, హెచ్ఎం అనూరాధ, కంటి వైద్య నిపుణులు సుదర్శనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్ధవీడు(బేస్తవారిపేట): స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మంగళవారం మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ అబ్దుల్ సత్తార్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బలరామిరెడ్డి, జేవీవీ జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, మండల కార్యదర్శి మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొమరోలు: నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలని ఎంఈఓ బొర్రా వెంకటరత్నం పేర్కొన్నారు. కొమరోలులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం జేవీవీ ఆధ్వర్యంలో చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల విభాగంలో ఎస్‌బీఎన్ఆర్ఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాల విద్యార్థులు షేక్ జాస్మిన్, గురుఅలైక్య, హనుమాసుబ్రమణ్యం, ప్రైవేట్ పాఠశాలల నుంచి సర్వైట్ పాఠశాల విద్యార్థులు హర్షిత, ప్రవీణ్, పవన్ ఎంపికైనట్లు జేవీవీ మండల ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ తెలిపారు. విజేతలకు ఎంఈఓ బహుమతులిచ్చారు. హెచ్ఎంలు కాశయ్య, గురుస్వామి, జేవీవీ జిల్లా కార్యదర్శి విశ్వరూపాచారి, ఎంఐఎస్ కోఆర్డినేటర్ పసుపులేటి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు మాజీ ఎమ్మెల్యే అన్నాకు ఆహ్వానం



అన్నా రాంబాబుకు ఆహ్వానపత్రిక అందిస్తున్న గిద్దలూరు అమ్మవారిశాల కమిటీ ప్రతినిధులు

మార్కాపురం టౌన్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనాలని మార్కాపురం, బేస్తవారపేట, గిద్దలూరు అమ్మవారిశాల కమిటీ ప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ అన్నా రాంబాబుకు ఆహ్వాన పత్రాలు అందించారు. మార్కాపురం అమ్మవారిశాల కమిటీ అధ్యక్షుడు చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, కోశాధికారి రామడుగు రమేష్ ఆహ్వానపత్రాలు అందించారు. గిద్దలూరు అమ్మవారిశాల కమిటీ ప్రతినిధులు వాడకట్టు రంగసత్యనారాయణ, రాముడు, పరుచూరి నాగేశ్వరరావు, నటకుల శివ తదితరులు పాల్గొన్నారు.

పొదిలి రూరల్: పొదిలి వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో దసరా ఉత్సవాలకు సకుటుంబ సమేతంగా హాజరుకావాలని కమిటీ ప్రతినిధులు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అన్నా రాంబాబును మంగళవారం ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు యక్కలి శేషగిరిరావు, శ్రీనివాసులు, చెంచు సుబ్బారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఎన్ఆర్ఎం పాఠశాలలో దసరా ఉత్సవాలు



అమ్మవారి వేషధారణలో అలరిస్తున్న విద్యార్థులు

కొమరోలు: మండల కేంద్రమైన కొమరోలులోని ఎస్‌బీఎన్ఆర్ఎం ఎయిడెడ్ పాఠశాలలో ముందస్తు దసరా వేడుకలు నిర్వహించారు. మంగళవారం చిన్నారులతో దసరా ప్రాముఖ్యతపై నాటికలు ప్రదర్శింపజేశారు. అమ్మవారి వేషధారణలో చిన్నారులు అలరించారు. కరస్పాండెంట్ బందుగుల నారాయణరెడ్డి దసరా విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ప్రధానోపాధ్యాయుడు బందుగుల సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ రేవతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలి

గిద్దలూరు రూరల్: రైతులు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని స్థానిక వ్యవసాయశాఖాధికారి విజయభాస్కర్‌రెడ్డి సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం గిద్దలూరు, ఉయ్యాలవాడ పరిధిలో రైతులకు అవగాహన కల్పించారు. ఏఓ మాట్లాడుతు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని పంటలు సాగు చేస్తే లాభాలు పొందవచ్చని చెప్పారు. కంది పంటను పరిశీలించి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఉద్యానవనశాఖ అధికారి విష్ణుప్రియ, వ్యవసాయ విస్తరణాధికారి శ్రీనివాసరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బేస్తవారిపేట: మల్బరీ షెడ్డు నిర్మాణానికి రూ.3.75 లక్షలు సబ్సిడీ ఇవ్వనున్నట్లు మార్కాపురం పట్టుపరిశ్రమశాఖ ఏడీఏ నారాయణరెడ్డి తెలిపారు. పూసలపాడు, ఒందుట్లలో రైతులకు సూచనలిచ్చారు. మల్బరీ మొక్కలు నాటుకునేందుకు యూనిట్‌కు రూ.45 వేలు అందజేస్తున్నామన్నారు. ఉద్యానశాఖ అధికారి డి.శ్వేత మాట్లాడుతూ.. ప్యాక్ హౌస్ నిర్మాణానికి 50 శాతం సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఏఓ జక్కం మెర్సీ మాట్లాడుతూ పత్తిలో తెల్లదోమ నివారణ చర్యలను వివరించారు. వీఏఏలు, హార్టికల్చర్, సెరీకల్చర్ సిబ్బంది పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్: మండలంలోని తిప్పాయపాలెం, చింతగుంట్ల గ్రామాల్లో పత్తి రైతులకు ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు అవగాహన కల్పించారు. పత్తి పంటలో గులాబీ పురుగు ఉధృతిని గమనించి, నివారణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో వీఏఏలు శివశంకరనాయక్, వెంకటేశ్వరరెడ్డి, రైతులు పాల్గొన్నారు.



బేస్తవారిపేట : రైతులకు సలహాలిస్తున్న ఏఓ జక్కం మెర్సీ



మార్కాపురం : పత్తిపంటను పరిశీలిస్తున్న ఎఓ, రైతులు

తర్లుపాడు: మండలంలోని తుమ్మలచెరువు, సీతానాగులవరం గ్రామాల్లో వరి, మిరప, బొప్పాయి పంటలను ఏఓ వెంకటేశ్వర్లు పరిశీలించారు. మిరపలో ఆకుమచ్చ తెగులు నివారణపై ఉద్యానవనశాఖాధికారి డి.రమేష్ సలహాలు, సూచనలు ఇచ్చారు. నీటిలో కరిగే ఎరువులను డ్రిప్ ద్వారా అందిస్తే పెట్టుబడి ఖర్చు తగ్గి దిగుబడి పొందవచ్చన్నారు. వీఏఎస్ సౌజన్య రైతులకు సబ్సిడీపై గడ్డి విత్తనాలు అందించారు. పశువులకు గాలికుంటు, గొంతువాపు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి నందన, తుమ్మలచెరువు సర్పంచ్ షాజహాన్, సర్పంచ్ ఆంజనేయులు, సెరీకల్చర్, మార్కెటింగ్ అధికారులు, వీఆర్ఓ కిశోర్, సర్వేయర్ హేమంత్, వీఏఏలు పాల్గొన్నారు.

కొమరోలు: మండలంలోని బ్రాహ్మణపల్లె, భావాపురంలో సాగు చేసిన పంటలను ఏఓ రాజశ్రీ పరిశీలించారు. వ్యవసాయశాఖ అధికారి మెర్సీ మాట్లాడుతూ.. శనగ విత్తనాలు రాయితీపై ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానశాఖాధికారి విష్ణుప్రియ, పట్టుపరిశ్రమశాఖ సాంకేతిక సహాయకుడు పాండురంగారెడ్డి పాల్గొన్నారు. జ

పొదిలి రూరల్: సాగు ఖర్చులు తగ్గించుకొని అధిక దిగుబడులు పొందాలని వ్యవసాయాధికారి జైనలాబ్దిన్ సూచించారు. పొదిలి మండలంలోని ఏలూరు, ఉప్పలపాడు గ్రామాల్లో రైతులకు పంటల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. కందిలో తెగుళ్ల నివారణ చర్యలను వివరించారు.

పొదిలిలో ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న అధికారులు

పొదిలి: నగర పంచాయతీలోని ప్రధాన రహదారిపై ఆక్రమణల తొలగింపు పనులను మున్సిపల్ అధికారులు మంగళవారం చేపట్టారు. కర్నూలు–ఒంగోలు రోడ్డులో వేకువ జాము నుంచే స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆక్రమణలను జేసీబీతో కూల్చివేశారు. పనులను పర్యవేక్షించిన కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సైడు కాలువలపై ఇరువైపులా ఏర్పాటు చేసిన బంకులు, రేకులు, బోర్డులు, ఇతరత్రా గోడలు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేదంటే తామే కూల్చేస్తామని చెప్పారు. మార్కాపురం అడ్డరోడ్డు నుంచి ఒంగోలు రోడ్డు, దర్శి రోడ్డు, అంతర్గత రోడ్లలో ఉన్న ఆక్రమణలు అన్నింటినీ తొలగించుకోవాలని స్పష్టం చేశారు. కాగా, ఆక్రమణల తొలగింపు సమయంలో దిగంబరంగా ఉన్న ఓ వ్యక్తి జేసీబీపై ఎక్కి హల్‌చల్ చేశాడు. అధికారుల ఫిర్యాదుతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అదుపులోకి తీసుకున్నారు.

600 మందికి దంత వైద్య పరీక్షలు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని విశ్వభారతి స్కూల్ ఆవరణలో శ్రీబాలాజీ సూపర్ స్పెషాలిటీ దంత వైద్యశాల ఆధ్వర్యంలో మంగళవారం 600 మందికి దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. దంతాలకు సంబంధించిన వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విద్యార్థులకు ఉచితంగా టూత్ పేస్టు, బ్రష్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైద్యశాల నిర్వాహకులు పాల్గొన్నారు.

వృద్ధులతో బాధ్యతగా ప్రవర్తించాలి



వృద్ధులను సన్మానిస్తున్న డాక్టర్ సూరిబాబు



ప్రజా సంకల్ప వేదిక ఆధ్వర్యంలో వృద్ధులకు సన్మానం

గిద్దలూరు రూరల్: వృద్ధులతో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ప్రవర్తించాలని ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సూరిబాబు పేర్కొన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో వృద్ధులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మానవత స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు గుళ్లా రామకృష్ణారెడ్డి, గంజి వీరయ్య, నరసింహులు, రవీంద్రారెడ్డి, డాక్టర్లు విజయభాస్కర్, ఆయేషా, సుధాకర్ పాల్గొన్నారు.

ప్రజా సంకల్ప వేదిక ఆధ్వర్యంలో..

గిద్దలూరులోని ప్రజా సంకల్ప వేదిక కార్యాలయంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సమాజ శ్రేయస్సు కోసం కృషి చేస్తున్న వృద్ధులను సంస్థ జిల్లా అధ్యక్షుడు ఓబిలిబోయిన వెంకటయ్య, జిల్లా మహిళా అధ్యక్షురాలు అడపాల నాగమణి, జిల్లా మాజీ సైనికులు విభాగం అధ్యక్షుడు బట్టబోతుల ఓబులేసు అధ్యక్షతన ఘనంగా సన్మానించారు. అనంతరం 139 బీసీ కులాల జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన జంగాల బాలయ్య యాదవ్‌ను సన్మానించారు.